# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ ఈ రోజు విడుదల చేశారు.
- దేశవ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు జరిగితే సమయం, డబ్బు ఆదా అవుతాయని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.
- కేంద్ర ప్రభుత్వ "పోషన్ పక్వాడ" కార్యక్రమం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉందని బాలింతలు, గర్భిణీలు పేర్కొంటున్నారు.
- వేసవి రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే రేపటి నుండి మే నెలాఖరు వరకు 42 ప్రత్యేక రైళ్లను నడపనుంది.
- రాష్ట్రంలో రేపు కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా ఈ రోజు విడుదల చేశారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 3 శాతం, రెండవ సంవత్సరంలో 5 శాతం ఉత్తీర్ణతా శాతం పెరిగింది. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో బాలికలు 71 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 64 శాతం ఉత్తీర్ణత పొందారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 81 శాతంతో బాలికలు ఉత్తీర్ణత పొందగా.. బాలురు 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో 85 శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా ప్రధమస్థానంలో నిలిచింది. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 54 శాతం ఉత్తీర్ణతతో చిత్తూరు జిల్లా చివరి స్థానంలో నిలవగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణతతో అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆఖరి స్థానం లభించింది. మంత్రి నారా లోకేష్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

==============================

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు ఈ రోజు విడుదలైన నేపథ్యంలో పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సప్లమెంటరీ పరీక్షలు షెడ్యూలును ఈ రోజు విడుదల చేశారు. సప్లిమెంటరీ పరీక్షలు తేదీలు, ఫీజు చెల్లింపు గడువు వివరాలను వెల్లడించారు. మే 12 నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు కోసం ఈనెల 22 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు.

==============================

దేశవ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు జరిగితే సమయం, డబ్బు ఆదా అవుతాయని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని ఈరోజు జరిగిన "ఒకే దేశం - ఒకే ఎన్నిక సదస్సు"లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రఎన్నికల సంఘం కూడా ఒకే ఎన్నిక విధానాన్ని సిఫారసు చేస్తోందని అన్నారు. ఒకేసారి దేశంలో ఎన్నికలు జరిగితే 12 వేల కోట్ల రూపాయలు ఆదా అవుతాయని వెంకయ్యానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

వేసవి రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపనున్నది. విశాఖపట్నం నుంచి బెంగళూరు, తిరుపతి, కర్నూలు సిటీ మధ్య మొత్తం 42 సమ్మర్‌లో వీక్లీ ప్రత్యేక రైళ్లను నడపనుంది. రేపటి నుంచి మే నెలాఖరు వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. విశాఖపట్నం - బెంగళూరు మధ్య ఆదివారం, తిరుగు ప్రయాణంలో సోమవారాల్లో ఈ రైలు అందుబాటులో ఉంటుంది. విశాఖపట్నం నుంచి తిరుపతికి ప్రతి బుధవారం, తిరుగు పయణంలో గురువారాల్లో ఈ రైలు అందుబాటులో ఉండనుంది. ప్రతి మంగళవారం విశాఖ నుంచి కర్నూలు సిటీకి, తిరుగు ప్రయాణంలో బుధవారాల్లో రైలు అందుబాటులో ఉంటుంది. ఈ రైళ్ల లో 2 ఏసీ, 3 ఏసీ, జనరల్ కోచ్‌లు ఉంటాయి.

==============================

సమసమాజ స్థాపన కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని, అన్ని వర్గాల వారికి సమాన న్యాయం అందించడం ఆయన లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఈ రోజు అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... అంబేడ్కర్ లక్ష్యాలే ఆదర్శంగా బీజేపీ ప్రజల కోసం పని చేస్తోందని తెలిపారు. ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి సందర్భంగా క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ వేడుకలను రేపటి నుంచి ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఈ సమావేశంలో చెప్పారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను గ్రామ గ్రామాన నిర్వహిస్తామని, అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజలకు వివరిస్తామని స్పష్టం చేశారు.

విరామం

==============================

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరిధిలోని ఎస్వీ గోశాలలో ఆవుల సంరక్షణకు అధునాతన సదుపాయాలు కల్పించినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ నారాయణ తెలిపారు. అమరావతిలో ఈ రోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... గోవుల బాగోగులను టీటీడీ పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేయడం

సమంజసం కాదన్నారు. టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తూ గోవుల సంరక్షణను చూసుకుంటున్నారని తెలిపారు.

==============================

గర్భవతులు, బాలింతలలో పోషకాహారం లోపాలను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం "పోషన్ పక్వాడ" పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని పశ్చిమగోదావరి జిల్లా విస్సాకోడేరు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిణి లక్ష్మీకాంతం తెలిపారు. ఈ రోజు భీమవరం మండలం రాయలం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలు, గర్భవతులు తీసుకోవలసిన జాగ్రత్తలను లక్ష్మీకాంతం వివరించారు. ఈ సందర్భంగా పోషన్ పక్వాడ లబ్దిదారైన పి. శ్రావణి ఆకశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

పాస్టర్ ప్రవీణ్ మృతిపై అన్ని విదాలా దర్యాప్తు చేపట్టామని ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాజమహేంద్రవరంలో ఈ రోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. ప్రవీణ్ దారిలో వెళ్తుండగా కొంతమందితో మాట్లాడారని, పలువురు సాక్షులను ప్రశ్నించి సమాచారం రాబట్టామని తెలిపారు. దారిలో ఆయనకు 3 సార్లు చిన్న చిన్న ప్రమాదాలు జరిగాయని, ప్రవీణ్ మృతిపై ఆయన కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయలేదని అన్నారు. సామాజిక మాధ్యమాలలో మాట్లాడిన వారు ఎలాంటి ఆధారాలూ ఇవ్వలేదని ఐజీ స్పష్టం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు బైక్ నాలుగవ గేర్‌లో ఉందని, ప్రవీణ్ వాహనాన్ని ఇతర వాహనాలు ఏవీ ఢీకొనలేదని ఫోరెన్సిక్ నిపుణులు స్పష్టం చేశారని ఐజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు.

==============================

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై చైత్రమాసం బ్రహ్మోత్సవాల్లో భాగంగా దుర్గామల్లేశ్వర స్వామి అమ్మ వార్లకు దివ్య కల్యాణ మహోత్సవాన్ని ఈ రోజు కన్నుల పండువగా నిర్వహించారు. పండితులు స్వామివారి, అమ్మవార్ల విశిష్టతను తెలియజేస్తూ తొలుత ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా స్వామి, అమ్మ వార్ల కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవ వేళ ఆదిదంపతులకు పట్టు వస్త్రాలను సమర్పించారు.

==============================

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ రోజు స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. భజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

==============================

వేసవిలో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని పార్వతీపురం మన్యం జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు పేర్కొన్నారు. ఈరోజు జిల్లాలోని సీతానగరం మండలం బుడ్డిపేట గ్రామంలో టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీకా అర్హుల జాబితాను పరిశీలించి షెడ్యూల్ ప్రకారం సకాలంలో టీకాలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం పిల్లల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

==============================

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 1500 మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్న నిన్నటి ఉపరితల ఆవర్తనం బలహీనపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వీటి ఫలితంగా రాష్ట్రంలో రేపు కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారి తెలియజేస్తూ.....

(వాయిస్ 31 సెకన్లు)

==============================
==============================